త్వరలోనే విలేకరులందరికీ ఇళ్ల స్థలాలు:కలెక్టర్

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిని తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీషా సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే తిరుపతి జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎమ్మెస్ రెడ్డి, ఎన్టీవీ రిపోర్టర్ వై. శశిధర్ రెడ్డి కలెక్టర్‌తో మాట్లాడుతూ సులూరుపేట నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వవలసిందిగా కోరారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీషా జర్నలిస్టులతో మాట్లాడుతూ ఆర్డీఓకి స్థల సేకరణ చేయమని ఆదేశాలు జారీ చేసి ఉన్నామని త్వరలోనే జర్నలిస్టులకు అందరికీ ఇళ్లస్థలాలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, సుధాకర్, నాగరాజా, రాజా,సర్దార్, శ్రీనాథ్ నాయుడు, బిట్టు, జర్నలిస్టులు కలెక్టర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

బుధవారం 14, ఫిబ్రవరి 2024 | 8పేజీలు

రైల్వే విద్యుత్ చార్జీలు పెంచే ప్రతిపాదన ఉంది

- రూ.3వేల కోట్లతో విద్యుత్ శాఖ అభివృద్ధి, విస్తరణ పనులు
- తిరుపతి రాష్ట్ర మీటింగ్ లో ఈ.ఆర్.సి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో రైల్వే శాఖకు సరఫరా చేస్తున్న కరెంట్ కు మాత్రం చార్జీలు పెంచాలన్న ప్రతిపాదన ఉందని రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈ.ఆర్.సి) చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి వెల్లడించారు. విద్యుత్ చార్జీల పెంపు, వినియోగదారుల సమస్యలు, శాఖ పనితీరు మెరుగుదల తదితర అంశాలపై మంగళవారం తిరుపతిలో రాష్ట్ర సలహా మండలి సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా ఈ.ఆర్.సి చైర్మన్, పలువురు సభ్యులు, సదరన్ డిస్కం ఉన్నతాధికారులు, కార్పొరేట్ కార్యాలయం జిల్లా అధికారులు, పీఆర్వో మధు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. అనంతరం ఈ.ఆర్.సి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి మీడియాతో మాట్లాడారు. సాధారణ విద్యుత్ చార్జీలు ఏ వర్గానికి పెంచే ఆలోచనే లేదన్నారు. అయితే రైల్వే శాఖకు సరఫరా చేస్తున్న కరెంట్ చార్జీలను ఏడాదికి రూ.100 కోట్ల రాబడి లక్ష్యంతో పెంచే ప్రతిపాదనలు సలహా మండలికి ఉన్నాయన్నారు. దీనిపై ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్లు చెప్పారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా రూ.3వేల కోట్లతో విద్యుత్ శాఖ లో అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా విషయాల్లో లోటుపాట్లు ఉంటే, రైతులకు లో ఓల్టేజితో విద్యుత్ సరఫరా లేకుండా చూసే నిమిత్తం ప్రతి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్లు నియమించి పర్యవేక్షణ బాధ్యతలను చేస్తున్నట్లు వివరించారు. సబ్ స్టేషన్ల పరిధిలో ఓవర్ లోడ్లు, విద్యుత్ అంతరాయాలను అధిగమించే చర్యలు వేగవంతం చేశామన్నారు. విద్యుత్ బిల్లుల పెంపు విషయంలో అన్నీ పారదర్శకంగా బిల్లులో వివరాలు ప్రింట్ చేసి వినియోగదారులకు ఇస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ వినియోగానికి వాడే కరెంట్ విషయంలో కొంత మేర కటింగ్ ఉందని, డిమాండ్ బట్టి వ్యవసాయానికి గంట సేపు, ఆపై విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్లు వెల్లడించారు. కానీ ఎక్కువ శాతం 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా వ్యవసాయానికి జరుగుతోందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో రెగ్యులేటరీ కమిషన్ సభ్యులు ఠాకూర్ రామ సింగ్, పివిఆర్ రెడ్డి, ఇతర విభాగాల సభ్యులు, డిస్కమ్ అధికారులు పాల్గొన్నారు.

చేపల వ్యాపారస్తులకు నష్టపరిహారం చెల్లించాలి:సిపిఐ

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీనివాస కళ్యాణ మండపాల వద్ద చిరు చాపల వ్యాపారస్తులకు జరిగిన నష్టాన్ని మఠం అధికారులు తక్షణమే చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకి వీధి విక్రదారుల సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కృష్ణాపురం తానా వద్ద నుండి ర్యాలీగా వెళ్లి హథీరాంజీ మఠం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ హథీరాంజీ మఠం భూములు లీజు పేరుతో ఎం కె నాయుడు కాలనీలో మఠం భూమి కోట్లది రూపాయలకు అమ్ముకుంటూ విల్లాస్ కడుతున్నారని గతంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేసిన ఆందోళన చేసిన వారిపై అక్రమ అరెస్టులు చేశారు తప్ప మఠం భూమిని మాత్రం భూ అక్రమ దారులు ఆక్రమించుకొని పెద్ద పెద్ద బిల్డింగులు కడుతున్న వాటిని ఏమైనా మాత్రం మఠం అధికారులు పట్టించుకోకుండా నిమ్మక నిరుత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. శ్రీనివాస కళ్యాణం మండపాల వద్ద మఠం భూములలో షెడ్లు నిర్మించుకొని కొంతమంది భూ అక్రమ దారులు బాడుగలు వసూలు చేసుకుని పోతున్నారని వాటిని ఏమని మాత్రం పట్టించుకోకుండా వీధిలో అమ్ముకునే చిరు వ్యాపారస్తులు రోడ్డు అనుకొని మఠం భూమి వద్ద చేపల అమ్ముకుంటే దౌర్జన్యంగా పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని దాడి చేయించి ఐదు లక్షల పైగా నష్ట చేశారని వాపోయారు. మఠం అధికారులకు ధైర్యం ఉంటే ఎం కె నాయుడు కాలనీలో కడుతున్న బిల్డింగులు కొడితే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అండగా నిలబడుతుందని అన్నారు. మఠం భూములను కాపాడుకొస్తున్న పేదవారి జోలికి వస్తే పెద్ద ఎత్తున హథి రాంజీ మఠం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం అధిరాంజీ కార్యాలయంలో లా అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వారు మాట్లాడుతూ చిరు చాపల వ్యాపారస్తులు మఠం భూములు ఆక్రమణకు గురికాకుండా చూసుకోవాలని అధికారులు కూడా చిన్న కుటుంబాల నుండ వచ్చిన వారే అని ఇంకా అలా జరగదని, పై అధికారులతో మాట్లాడి వారికి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్న పెంచలయ్య, నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ డి రవి, నగర కార్యదర్శి ఎన్ శ్రీరాములు, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ శివ, పద్మా రెడ్డి, రామకృష్ణ, బండి చలపతి, గోవిందస్వామి, జింక నాగరాజు, వీధి వ్యాపారస్తులు యూనియన్ నగర కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ బాల, ఆర్ని రమేష్, వెంకటేష్ ,సురేష్, ప్రమీల, నవీన్, ప్రవీణ్, విజయ, అలివేలమ్మ ,విజయ్ కుమార్ వీధి వ్యాపారస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీవారి రథసప్తమి వేడుకలకు

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు:ఎస్పీ

విశాలాంధ్ర- తిరుమల కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 16 తేదిన నిర్వహించు వార్షిక రథసప్తమి వేడుకలను దృష్టిలో పెట్టుకొని జిల్లా ఎస్పి మలిక శ్రీవారి వాహన మండపం, మాడ వీధులు, పుష్కరిణి, గేలరీలు, ఎంట్రీ ఎగ్జిట్ గేట్లు, ఇన్నర్ అవుటర్ రింగ్ రోడ్డు, కమాండ్ కంట్రోల్ రూమ్ లను పరిశీలించారుఅనంతరం రథసప్తమి నిర్వహణకు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు గురించి అధికారులు పలు సూచనలు చేశారు. అలాగే అత్యవసర వాహనాలకు, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ఎస్పీ తితిదే సి.వి.ఎస్.ఓ నరసింహ కిషోర్‌లు పలు శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీవారి రథసప్తమి వేడుకలు అతి ముఖ్యమైన పవిత్రమైన రోజు నిర్వహించే ఉత్సవం బ్రహ్మోత్సవాలలో వాహన సేవలు ఎలా నిర్వహిస్తారో అదేవిధంగా రథసప్తమి నాడు కూడా నిర్వహిస్తారు శ్రీ మలయప్ప స్వామి వారు ఒకే రోజు మాడ వీధుల్లో 7 వాహనాల పై ఊరేగి భక్తులకు దర్శనం ఇస్తారని, ఈ ఉత్సవాలకి స్థానిక భక్తులే కాకుండా సుదూర ప్రాంతాల నుండి కూడా అశేషంగా భక్తులు వస్తారు గంట గంటకు వాహన సేవలు వున్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారుఉదయం ప్రారంభమయ్యే సూర్యప్రభ వాహనం, గరుడ వాహనం మరియు చక్ర స్నానానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కావున దానికి అనుగుణంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అన్నారు తిరుమలకు వచ్చు భక్తులకు రక్షణ మరియు భద్రత కల్పించే బాధ్యత పోలీస్ వారిపై ఉంటుంది. కాబట్టి తిరుపతి తిరుమలను అనుసంధానించే రెండు ఘాట్ రోడ్లు, తిరుమల పరిసర ప్రాంతాలలో జిల్లా సాయుధ దళం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తూ జల్లెడ పడుతున్నారు. తిరుపతి తిరుమల యందు పోలీసు వారి సూచనల ప్రకారం ట్రాఫిక్ నిమయ నిబంధనలు పాటిస్తూ వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేసి పోలీసు శాఖ కు మరియు తోటి భక్తులకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేసారుఅదేవిధంగా ఇతర శాఖల అధికారులు సిబ్బంది పోలీసులకు సహకరించాలని పోలీసులే చొరవ తీసుకొని అన్ని శాఖలను సమన్వయపరుచుకుంటూ రథసప్తమి వేడుకలను విజయవంతం చేయాలని పోలీసులకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం మర్యాద పూర్వకంగా టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి నీ సి వి ఎస్ ఓ నరసింహ కిషోర్ ని కలిశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శివరామి రెడ్డి తిరుమల, డీఎస్పీ యస్పి భాస్కర్ రెడ్డి,తిరుమల డిఎస్పి శ్రీనివాసులు ఆచారి, టిటిడి విజిఒ సిఐలు, విజయకుమార్, సత్యనారాయణ, ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రత్యేక పడవ ద్వారా ఇరకం గ్రామానికి చేరుకున్న కలెక్టర్
గ్రామంలోని అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి
పోలింగ్ కేంద్రాల్లో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - తడ : ఇరకం దీవిలోని ప్రజలు తమ ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్క ఓటరు వినియోగించుకోవాలి అని ఇరకం దీవి గ్రామం లోని పోలింగ్ కేంద్రాల తనిఖీ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ శ గ్రామ ప్రజలను కోరారు. మంగళవారం ఉదయం సూళ్లూరుపేట నియోజక వర్గం తడ మండల పరిధిలోని ఇరకం గ్రామానికి పులికాట్ సరస్సులో ప్రత్యేక పడవ ద్వారా ఇరకం దీవికి చేరుకొని ట్రాక్టర్ ద్వారా గ్రామానికి చేరుకుని గ్రామం లోని పాటశాల వద్ద ఏర్పాటు చేసిన 291 మరియు 292 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి అని, అందుకొరకు అన్ని ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ర్యాంపు ఏర్పాట్లు నిబంధనల మేరకు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 291 పోలింగ్ కేంద్ర పరిధిలోని ఓటర్లు సుమారు 407 మంది, 292 పోలింగ్ కేంద్ర పరిధిలో 670 మంది ఉన్నారని వారు అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా బిఎల్వోలు సంబంధిత అధికారులు ప్రజల్లో విస్తృతంగా

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

292 పోలింగ్ కేంద్రం నున్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇరకం కుప్పం ను పరిశీలించి మరమ్మతులకు గురైన ఆ భవనానికి త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు. డూప్లికేట్ ఎంట్రీ, మరణించిన ఓటర్ల వివరాలను అప్డేట్ చేయాలని, ఫోటో లు సరిగా కనపడని వాటిని సేకరించి అప్డేట్ చేయాలని రెవెన్యూ అధికారులకు, బిఎల్వో కు సూచించారు. ఇదే క్రమంలో ఈ రకం దీవిలోనున్న పిహెచ్సి సబ్ సెంటర్ ను తనిఖీలు చేసి పీహెచ్సీ నందు మందులు సరిపడా ఉంచుకోవాలని, హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న వారికి ఎప్పటికప్పుడు మందులు, పౌష్టికాహారం అందించాల్సి ఉంటుందని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందుతున్న వారికి మందులు, ఫాలో అప్ ఉండాలని సూచించారు. పిల్లలు, కిషోర బాలలు అందరికి నులిపురుగుల నిర్మూలన మందులను మింగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, క్వాలిఫైడ్ డాక్టర్లు ఉన్నరని ప్రజలకు వివరించి అవగాహన కల్పించి ఉత్తమ వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇరకం దీవి టూరిజం ప్రమోషన్ కు అవకాశం గల ప్రదేశమని దీవి నందు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానంలో ప్రకృతి సమతుల్యతను కాపాడుతూ ఔత్సాహికులు ముందుకు రావాలని కోరారు. ఫిషర్ మన్ లకు చెందిన పట్టాల పంపిణీ పెండింగ్ అంశాన్ని త్వరితగతిన వారంలోపల పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బడి ఈడు పిల్లలను వారి తల్లి తండ్రులు పిల్లలను బడికి పంపాలని, నాడు నేడు కింద పాఠశాలలో పనులు పురోగతిలో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి గుణశేఖర్ , గ్రామస్థులు కలెక్టర్ గారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పర్యాటక శాఖ వారి అతిథి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్ర నాథ్ రెడ్డి, తడ మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎన్నికల డిటి లు పవన్ కుమార్, శరత్, నాయుడుపేట డిఎస్పి శ్రీనివాస రెడ్డి , సూళ్లూరుపేట సిఐ మధుబాబు తడ ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తదితరులు

వైసీపీపై బలిజ నేతల ఆగ్రహం

విశాలాంధ్ర – తిరుపతి : గ్రేటర్ రాయలసీమ పరిధిలో వైసీపీ ప్రభుత్వం బలిజలకు ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వకపోవడం దారుణమని రాష్ట్ర బలిజ నాయకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత ఎన్నికల్లో దర్శి, చిత్తూరులోనే బలిజలకు టికెట్లు ఇస్తే ఎమ్మెల్యేలుగా గెలిచారని ఇప్పుడు వారిద్దరినీ కాదని వేరే వాళ్లకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. 16% ఉన్న బలిజకాపులకు ఉన్న 74 సీట్లు లో తగిన విధంగా సీట్లు కేటాయించి ప్రాధాన్య కల్పించాలని ఆయన కోరారు.బలిజలకు సీట్ల కేటాయింపులలో పునరాలోచించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రానున్న ఎన్నికలలో తమకు న్యాయం చేసే పార్టీకి తమ మద్దతు ఉంటుందని ఓటుతో తగిలి బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బెల్లంకొండ సురేష్, రాజేంద్ర ,రామారావు ,చింతకాయల కృష్ణయ్య పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ సీజన్-1 లో
ఎంజిఎం జూనియర్ కాలేజ్ విద్యార్థుల విజయభేరి

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి : జేఈఈ మెయిన్స్ సీజన్-1 లో ఎంజిఎం జూనియర్ కాలేజ్ విద్యార్థుల విజయభేరి మోగించారు. జనవరి 2024 లో నిర్వహించిన జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ లో 2024 సెషన్ -1 లో ఎన్టిఏ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించి శ్రీకాళహస్తి పట్టణంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ లో 2024 సెషన్ -1 లో ఎన్టిఏ ఫలితాల్లో ఎంజిఎం విద్యార్థులు వి.వినయ్ 94.36675, ఎస్.యుగంధర్ రెడ్డి 91.933929, బీ.మేఘన 80.557766 మొదటి స్థానం కైవసం చేసుకోగా, వీరితో పాటు ఆర్.వినీషా, భాగ్యశ్రీ,కె.హేమంత్, బి.ముని సాయి కుమారి అర్హత సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను వారికి సహకరించిన అధ్యాపకులను డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ప్రిన్సిపల్ వి.ఎస్ రత్నం విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు.

వైఎస్సార్ చేయూత పై అవగాహన

విశాలాంధ్ర - వి.కోట: రాష్ట్ర ప్రభుత్వం 45 నుండి 60 సంవత్సరాలు వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద 18, 750 రూపాయలు అందజేస్తున్న విషయం తెలిసిందే. అలాగే మహిళలు ఆర్థికంగా ఎదుగుదలకు జీవనోపాదుల పెంపుదలకు మరింత పెట్టుబడి అవసరమైతే మహిళా సంఘాల నుండి పొదుపు నుండి రుణాలు, విఓ ఋణాలు, స్త్రీనిధి ఋణాలు, బ్యాంకు ఋణాలు లాంటివి అవసరమైన వారికి 75, 000 ల రూపాయలు వరకు ఇవ్వడం జరుగుతుందని మంగళవారం వారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సిసి నాగరాజు, రామక్రిష్ణ, సంఘమిత్ర తనూజ చేయూత లబ్ధిదారులు పాల్గొన్నారు.

సి.సియల్ఏ ఉత్తర్వులు వచ్చినా ఫలితం శూన్యం

విశాలాంధ్ర–చౌడేపల్లి : మండలం లోని దుర్గసముద్రం గ్రామపంచాయతీ నందు చారాల సి.యల్.డి.పినందు ప్రభుత్వం వారు బడుగు బలహీనుల అభివృద్ధి కోసం 1992-93 వ సంవత్సరం సుమారు 170 ఎకరాల ప్రభుత్వ భూమిని కో-ఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ ల పేరుతో దాదాపు 34 లక్షల నిధులతో ఇచ్చింది.అందులో చారాల గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్,చీటర్,కే.డి నెంబర్ 3 ఐన కుళ్ళాయి రమణ అను వ్యక్తి ప్రెసిడెంటుగా.మరికొందరు మెంబర్లు గా కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి నిధులను లబ్దిదారుల సమగ్ర భూ అభివృద్ధికి ఉపయోగించుకోకుండా తన అవసరాలకోసం ఉపయోగించుకున్నారు. అంతేకాకుండా లబ్దిదారులకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా ఒకచోట ఉంటే భూమి ఇతను ఎక్కడ చూపిస్తే అక్కడ లబ్దిదారులు సాగుచేసుకోవాల్సిందే అలా అందరిని బెదిరించుకొని కొంతమంది ఆర్థిక పరిస్థితి ని ఆసరాగా చేసుకొని మీ భూమి చదును చేయాలి ఇక్కడ సంతకాలు పెట్టండి అని చెప్పి కొందరి వద్ద ఖాళీ నాన్ జుడిషియల్ స్టాంపు పేపర్ల పై సంతకాలు చేయించుకున్నారు.అతను ఎక్కడ భూమి చూపించి ఇదే నీదని చెప్తే అక్కడ వ్యవసాయం చేయాల్సిందే.ప్రస్తుతం 74 లబ్దిదారులకు గాను కేవలం6-7 మంది మాత్రమే అక్కడ వ్యవసాయం చేస్తున్నారు.సదరు భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి 30 సంవత్సరాలు గడుస్తున్ననూ కొందరికి తమ భూమి ఉందా? లేదా? అనికూడా తెలియని వారు ఇంకా ఉన్నారు.ఒక సారికూడా సాగుచేయని వారు కూడా ఉన్నారు.అభివృద్ధి నిధులు పారా వర్కర్ల సహాయం తో స్వాహా,సూక్ష్మబిందుసేద్యం పరికరాలు రాత్రికి రాత్రే అమ్మేశారు,బోరుబావుల మోటార్లు సైతం అమ్మేశారు.క్రమేపి అతని పేరు కుళ్ళాయి రమణ ను అడివి రమణ గా మార్చుకొని భూపోరాట కమిటీ ఏర్పాటు చేసి చౌడేపల్లి, పెద్దపంజాణి, పుంగనూరు, రామసముద్రం, సోమల, సదుం, గంగవరం, పలమనేరు,నిమ్మన పల్లి మండలాలలో తమ అనుచరులతో భూదానం భూమి పేరుతో దాదాపు ఐదు నుండి పది కోట్లు వసూలు చేశాడు. అంతేకాకుండా ఎవరివద్దనైతే సంతకాలు తీసుకున్నాడో వారి భూములను ఇతను పూర్తిగా లాక్కోవడం జరిగింది.ఎవరైనా ప్రశ్నిస్తే తన అనుచరులతో దాడిచేయించేవాడు.ఇదిలా ఉండగా 2016 వ సంవత్సరం గ్రామస్థుడైన ఉత్తరాది హరిప్రసాద్ ఇతడు చేసిన మోసాల పై వ్యాసం రాశాడని అతన్ని తన అనుచరులతో కొట్టించడం జరిగింది.తర్వాత ఉత్తరాది హరిప్రసాద్ గ్రామం లో ఇలా జరిగిందని బయటి ప్రాంతాలకు వెళ్ళి పనుచేసుకుంటుంటే ఉత్తరాది హరిప్రసాద్ ని చంపేశామని,అతని బాడికూడా దొరకకుండా చేశామని ప్రచారం చేసుకున్నాడు.అదితెలిసిన ఉత్తరాది హరిప్రసాద్ తిరిగి గ్రామానికి వచ్చి తిరిగి సదరు భూముల పై పోరాటం ప్రారంబించి సమాచార హక్కు చట్టం 2005 ను ఉపయోగించి సదరు సి.యల్.డి.పి కి చెందిన భూముల తాలుకూ స్కెచ్ లు,పత్రాలు సంపాదించాడని 2020 నందు ఉత్తరాది హరిప్రసాద్ ను చంపాలని అతని పొలం వద్ద నాటు బాంబులు ఏర్పాటు చేశాడు.తృటిలో తప్పించుకోనేందుకు ప్రయత్నించిన ఉత్తరాది హరిప్రసాద్ తన పెంపుడు కుక్కలైన జానీ,టామీలను పోగొట్టుకున్నాడు.ఈ విషయం పైన చౌడేపల్లి పోలీస్టేషన్ నందు 145/2020 గా కేసునమోదైనది.ప్రస్తుతం కోర్టుపరిధి లో ఉన్నది.ఎవరైనా భూముల వద్దకు మావి అని వెళ్తే అడవి రమణ కుమారులు ,అతని అనుచరులు దాడులు చేస్తున్నారు.ఇప్పటికి ఇతని వద్ద ఇతగాడి ఇంటి లో ప్రజలను మోసం చేసి రాయించుకున్న స్టాంపుపత్రాలు,కర్నాటక వాసులకు,ప్రక్క గ్రామస్థులకు అమ్మిన పత్రాలు,నకిలీ పాసుపుస్తకాలు,ఒరిజినల్ పాసుపుస్తకాలు ఉన్నాయి.ఇతడికి దుర్గ సముద్రం గ్రామ రెవిన్యూ సహాయకులు,గ్రామ రెవిన్యూ అధికారి అండదండలు పుష్కలంగా ఉన్నాయి.అంతే కాకుండా ఒక రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి అతను దుర్గసముద్రం లో ఉన్నాడని అతని వద్ద సదరు భూమికి సంబందించిన రికార్డులు,పాసుపుస్తకాలు ఉంచినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి..ఐనా పట్టువిడవని ఉత్తరాది హరిప్రసాద్ సదరు సి.యల్.డి.పి భూముల పైన చౌడేపల్లి తాహశీల్దార్,సబ్ కలెక్టర్ మదనపల్లి,రెవిన్యూ డివిజన్ మారిన తర్వాత పలమనేరు ఆర్.డి.ఓ కు జిల్లా కలెక్టర్ చిత్తూరు వారికి పిర్యాదులు చేయగా ఎటువంటి చర్యలు లేవని చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మంగళగిరి వారికి మార్చి 2023 న పిర్యాదు చేయగా సి.యల్.డి.పి. వారు తక్షణ చర్యలు తీసుకోమని మే 2023 న జిల్లా కలెక్టర్ వారికి ఉత్తర్వులు ఇచ్చారు.ఐనా ఎటువంటి ఫలితం లేదని తిరిగి జులై 2023 న సంబందిత అధికారుల పైన చర్యలు తీసుకోవాలని,అలాగే చారాల గ్రామం లో అడవి రమణ ప్రభుత్వ డ్రైనేజి కాలువను పూర్తిగా పూడ్చివేసి దానిపైన ప్రహరి నిర్మాణము చేశాడని స్పందన లో రెండుమూడుసార్లు పిర్యాదు చేసినా లాభం లేదని పంచాయతీ అధికారులు ప్రహరీ ని కూల్చడం లేదని అధికారుల పైన చర్యలు తీసుకోవాలని చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మంగళ గిరి వారికి పిర్యాదు చేశారు.అక్కడి నుండి చిత్తూరు జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు వచ్చిననూ పట్టించుకోని చిత్తూరు జిల్లా కలెక్టర్ .ఇప్పటి కైనా చిత్తూరు జిల్లా కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని లబ్దిదారులు కోరుచున్నారు.

కోలా ఆనంద్ గెలుపు కోసం విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : బీజేపీ నేత కోలా ఆనంద్ గెలుపు కోసం అసెంబ్లీ కో - కన్వీనర్ మేళగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు నేతృత్వంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు వాడవాడలా విస్తృత ప్రచారం చేపట్టారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ కుమార్ సూచనలుతో శ్రీకాళహస్తి పట్టణంలో గల భాస్కర పేట, 100 పోలింగ్ బూత్ నందు "పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు" ఆధ్వర్యంలో బీజేపీ నేతలతో కలిసి గడపగడపకు వెళ్లి ఓటర్లకు కేంద్ర ప్రభుత్వ నరేంద్రమోదీ సంక్షేమ పథకాలను గురించి తెలియజేస్తున్నారు. భారతీయ జనతా పార్టీ సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ లోను, శ్రీకాళహస్తి "నియోజకవర్గంలో విజయం మాదే" అంటూ కమలనాథులు ఓటర్ చుట్టా తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి, అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్క ఓటరు గుర్తించి "దేశం కోసం మరొక్కమారు నరేంద్రమోదీ" కోసం - "శ్రీకాళహస్తి అభివృద్ధి కోసం ఒక్కసారి కోలా ఆనంద్ కుమార్" కోసం భారతీయ జనతా పార్టీని ఆశీర్వదించి కమలం గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని ప్రజలు మార్పుకోరుతున్నారని బీజేపీ నేత పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ, అసెంబ్లీ కో - కన్వీనర్ మేళగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు, ఓబీసీమోర్చా పట్టణ అధ్యక్షులు కన్నా వెంకటేశ్వర్లు, పట్టణ ఉపాధ్యక్షులు లింగాబత్తిన గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దు వాసు యాదవ్, బీజేపీ సీనియర్ నేతలు జీవి అమర్నాథ్, ఇమ్మిడిశెట్టి మోహన్ రావు, యువమోర్చా సింగమాల కుమార్, గిరిధర్ సాయి, నాని పాల్గొన్నారు.

సదుంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - సదుం: సదుం మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కి చుట్టుపక్కల ఉన్న ప్రజలు వచ్చి వారి వారి సమస్యలను డాక్టర్లకు తెలిపి చికిత్స పొందారు. ఈ కార్యక్రమంలో చాలామంది సంతోషం వ్యక్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్న సదుం జడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప,జిల్లా సెల్ అధ్యక్షులు వెంకటస్వామి, పార్టీ మండలాధ్యక్షులు రెడెప్ప రెడ్డి, జేసీఎస్ సదుం మండల ఇంచార్జ్ ప్రకాష్ రెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ జగనన్నకు సదుం ప్రజలు ఎంతగానో ఋణపడ్డారు అని తెలిపారు.

జనసేనలో ముస్లిం లకు సముచిత స్థానం

విశాలాంధ్ర–కార్వేటినగరం :కార్వేటి నగరం గ్రామపంచాయతీ, ముస్లిం కాలనీలో జనం కోసం జనసేన భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి జనసేన నియోజకవర్గం ఇంచార్జి యుగంధర్ పొన్న సతీమణి స్రవంతి రెడ్డి హాజరయ్యారు. ప్రతి ఇంటికి వెళ్లి భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కార్వేటి నగరం టౌన్ ప్రెసిడెంట్ రాజేష్, కార్వేటి నగరం మండల అధ్యక్షులు శోభన్ బాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, మండల బూత్ కన్వీనర్ మండి సురేష్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు సెల్వి, టౌన్ ఉపాధ్యక్షులు చిరంజీవి ,చంద్ర, ప్రధాన కార్యదర్శి మహేంద్ర, మీన, కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి రుద్ర, పాలసముద్రం మండల అధ్యక్షులు లతీష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, వెదురు కుప్పం మండల ఉపాధ్యక్షులు మునిరత్నం శెట్టి, ప్రధాన కార్యదర్శి బెనర్జీ, కాపు యువసేన మండల అధ్యక్షులు మాదాసి వెంకటేష్, జనసైనికుడు సునీల్, సీనియర్ నాయకులు రూపేష్ , వీరమహిళ మంజుల పాల్గొన్నారు.

వైసీపీ తీరుతో నష్టపోయేది ఉద్యోగులే:జనసేన

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనా తీరుతో ఉద్యోగులు, అధికారులు ఉద్యోగాలు కోల్పోయే దుస్థితి వచ్చిందని "జనసేన" తిరుపతి ఇన్ చార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ నాయకులతో కలసి తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో.. అధికారం కోసం వైసీపీ నేతలు అడ్డదారులు తొక్కి, ఉద్యోగులను ప్రలోభాలకు గురి చేసి, అధికారులపై ఒత్తిడి తెచ్చి వారి సొంత లాభం కోసం ఐఏఎస్ అధికారులతో సహా.. ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ స్థాయికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోలీస్ అధికారులను, వివిధ ఉద్యోగ సంఘాలను చట్టానికి వ్యతిరేకంగా వాడుకున్నారని, ఇందులో భాగంగా కొందరు ఐఏఎస్ లు, పోలీసు అధికారులు వారి ఉద్యోగాలను కోల్పోవడం జరిగిందని, వైసీపీ నేతలు ఉద్యోగుల చేత చట్ట వ్యతిరేక పనులు చేపించి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ఉద్యోగాలు కోల్పోయిన వారిని కనీసం పట్టించుకున్నారా అని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డి ప్రశ్నించారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని రానున్న ఎలక్షన్లలో అధికారుల ప్రలోభాలకు లొంగకుండా.. ప్రతి ఒక్క ఉద్యోగి నిస్వార్థంగా వారి, వారి విధులను నిర్వర్తించాలని కోరారు. అధికారాన్ని అనుభవించేది వైసీపీ నేతలు అయితే, ఆ వైసీపీ నేతల చేతిలో చిక్కుకొని ఉద్యోగాలను కోల్పోయేది మీరేనని.. దయచేసి రాష్ట్రంలో ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగి అయినా సరే, అధికార పార్టీ నేతల వలలో పడవద్దని, మరో కొద్ది రోజులు మాత్రమే అధికార పార్టీకి వాలిడిటీ ఉందని, వారి వలలో పడి చేయకూడని పనులు చేస్తే పోయేది మీ ఉద్యోగాలేనని రాజారెడ్డి గుర్తు చేశారు.ఆంధ్ర రాష్ట్రంలో రానున్నది జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వమేనని, ఎక్కడికక్కడ ప్రజలు ఈ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో జనసేన నేతలు దినేష్ జైన్, రాజేష్ ఆచారి, హిమవంత్, కిషోర్, పవన్, మనోజ్, సాయి దేవ్, మణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేసిన అధికారులు

విశాలాంధ్ర - సోమల : రాష్ట్రంలో రానున్న ఎన్నికల నేపధ్యంలో ముందస్తు చర్యలలో బాగంగా సోమల మండలంలోని తహశీల్దార్ నాగరాజ, సి.ఐ.కృష్ణారెడ్డి లు మండలం లో పోలింగ్ జరగనున్న అన్ని పాఠశాలల్లో తనిఖీ లు చేపట్టారు. ఈ క్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటును వినియోగించే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు కు తెలిపారు. అదేవిధంగా కందూరు గ్రామంలో గల పాఠశాల ను సందర్శించి అక్కడ ఉన్న లోపాలు ను సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోమల ఎస్.ఐ.వెంకట నరసింహులు, వి.ఆర్.ఓ.శ్రీనివాసులు ఉపాధ్యాయులు, సచివాలయంసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమల తహసీల్దార్‌గా నాగరాజ

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం నకు రానున్న ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తహశీల్దార్ లను బదిలీలు నిర్వహించారు.. ఈ క్రమంలో అనంతపురం జిల్లా లో కలెక్టర్ కార్యాలయం లో పనిచేస్తున్న నాగరాజ ను సోమల మండలం నకు తహశీల్దార్ గా బదిలీ చేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్‌గా నాగరాజు సోమవారం భాద్యతలు చేపట్టారు. ఈ క్రమంలో తహశీల్దార్ కార్యాలయం లో శ్యాంప్రసాద్ రెడ్డి మరియు సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు ఆయనకు కలసి శుభాకాంక్షలు తెలిపి తీపి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగరాజ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎన్నికల్లో పరిపాలన లో తన బాధ్యతలను అందరికి ఆమోదయోగ్యమైన పద్ధతుల్లో విధుల్లో నిర్వహిస్తానని తెలిపారు.

నిరసన చేపట్టనున్న ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-పలమనేరు :ఏపీ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వ సాచివేత దోరణి కి నిరసనగా రాష్ట్ర శాఖ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణ లో భాగంగా 14 వ తేదీ బుధవారం అందరు ఉద్యోగ ఉపాధ్యాయులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ విధులకు హాజరు కానున్నట్లు పలమనేరు తాలూకా ఏపీజేఏసీ చైర్మన్ ఆనందబాబు మరియు సెక్రెటరీ జనరల్ ప్రకాష్ స్థానిక ఎన్జీఓ హోం నందు ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం నందు జిల్లా ఏపీ ఎన్జీఓ సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, పలమనేరు కార్యదర్శి జయమ్మ, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల నాయకులు హరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు క్రషర్‌ను ధ్వంసం చేసిన ఏనుగులు

విశాలాంధ్ర -సదుం: సదుం మండలం జోగివారిపల్లి పంచాయతీ మార్తువారిపల్లి లో రాత్రి సమయంలో బుసగాని లోకనాథకి చెందిన చెరుకు కసరును ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు. రాత్రి సమయంలో చెరుకులను చూసి ఏనుగులు గుంపుగా వచ్చి అక్కడ చెలిగి ఉన్న చెరుకులను కసరును పగలగొట్టి అక్కడ ఉన్న బాధితుని వస్తువులను మరియు పందిలిని ధ్వంసం చేయడం జరిగింది.దాదాపు 50 వేల రూపాయల నష్టం కావడంతో బాధితుడు ఎంతో ఆవేదనకు గురయ్యాడు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం లోని కందూరు గ్రామంలో జిల్లా అధికారులు ఆదేశాల మేరకు సోమల ఎస్.ఐ.నర సింహులు మరియు సిబ్బంది గ్రామాల్లో పర్యటించరు. అనంతరం ఆయన గ్రామస్తుల తో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ని యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా పెద్దలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.అలాగే రానున్న ఎన్నికల నేపథ్యంలో కలికిరి మార్గంలో వాహనాలు ను తనిఖీలుగాను పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు.అనంతరం వచ్చు పోవు వాహనాలను తనిఖీలు నిర్వహించారు

జేఈఈ మెయిన్స్‌లో ఆకాష్ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతి ఆకాష్ విద్యాసంస్థల ద్వారా జేఈఈ పరీక్షలకు హాజరైన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తిరుపతి ప్రాంతానికి తగిన గుర్తింపు తెచ్చారని ఆకాష్ బైజూస్ విద్యాసంస్థల సీనియర్ అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ కుమార్, రీజనల్ సేల్స్ హెడ్ ఎం భరత్ కుమార్ పేర్కొన్నారు. ఆకాష్ విద్యాసంస్థలకు చెందిన రిషి శేఖర్ శుక్ల 300 /300 మార్కులు సంపాదించి 100% పర్సంటైల్ సాధించి తెలుగు రాష్ట్రాలలో ఆకాష్ పేరును చిరస్థాయిగా నిలిపాడని ఈ సందర్భంగా వెల్లడించారు. తిరుపతి బ్రాంచ్ నుంచి ఆర్ రిత్విక్ 99.34, కే జై చంద్రారెడ్డి 99.11, ఎం శివ చరణ్ 98.69 పర్సంటేజ్ ను సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు అన్నారు. తిరుపతి నుంచి 20 మందికి పైగా విద్యార్థులు 91 శాతానికి పైబడి పర్సంటేజ్ సాధించి తమ ప్రతిభను కనబరిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేళతాళాలతో భాజ భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించి సహజర విద్యార్థుల ఉత్సాహాన్ని నింపేందుకు ప్రత్యేక ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. వారిని ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్ మోడ నరసింహులు, బ్రాంచ్ ఇంజనీరింగ్ అకాడమీ హెడ్ శ్రీరామ రమేష్, తిరుపతి గీతం విద్యాసంస్థల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని వారిని అభినందించారు. శత శాతం ఫలితాలు సాధించిన రిషి శుక్లా ను ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీస్ లిమిటెడ్ రీజినల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా సత్కరించి అనంతరం మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ లో తమ విద్యార్థుల అత్యంత ప్రతిభను కనబరిచి తమ ప్రాభవం చాటుకున్నారని తెలిపారు. పద్ధతితో విద్యను అందించే సంస్థగా ఆకాష్ బైజూస్, నీట్ సహా అనేక పోటీ పరీక్షలలో జాతీయస్థాయి ర్యాంకులను సాధించడంలో ముందంజలో ఉందని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు చేసి అందర్నీ ఆకట్టుకున్నారు.

మండల అభివృద్ధిలో చెవిరెడ్డి పాత్ర మరువలేనిది: ఎంపీపీ

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండల అభివృద్ధిలో చంద్రగిరి శాసనసభ్యులు చెవి రెడ్డి భాస్కర్ రెడ్డి పాత్ర మరువ లేనిదని ఎంపీపీ లోకనాథం తెలిపారు. మంగళవారం స్థానిక పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో మండల అభివృద్ధికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. గడపగడపకు మహా పాదయాత్ర సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రతి పంచాయతీకి 30 లక్షల రూపాయలు కేటాయించారని అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జడ్పిటిసి పద్మజా రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో ఇదే చివరి మండల సర్వసభ్య సమావేశం అని ఈ ఐదేళ్లలో విద్య ,వైద్య రంగంలో విశేష ప్రగతిని సాధించామని ఇందుకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సింగిల్ విండో చైర్మన్ మునీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా పాలనలో నవరత్నాలను వాలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులు అందరికీ అందజేశామన్నారు. తహసిల్దార్ వాణిశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న జగనన్న భూ సురక్ష కార్యక్రమం ద్వారా వందేళ్ల తర్వాత భూ సర్వే జరుగుతున్నదని వీటి వలన ప్రజలకు ఎంతో ఉపయోగ ఉంటుందని కావున ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాకాల సర్పంచ్ కస్తూరి మాట్లాడుతూ పాకాల గ్రామపంచాయతీ పరిధిలో సెంథిల్ అనే రేషన్ డీలర్ ఆరు నెలలుగా రేషన్ వస్తువులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని వరుసగా మూడు నెలలు రేషన్ తీసుకోకుంటే రేషన్ కార్డులు రద్దు అవుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారని దీని పై చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వేసవిలో డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్రబాబు, వైస్ ఎంపీపీ నాగూర్ బి ,రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మొబ్బునేని రఘుపతి వివిధ శాఖల అధికారులు సర్పంచులు , ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో క్యాంపస్ సెలక్షన్స్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల నందు జెకెసి కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌పై అవగాహన, క్యాంపస్ సెలెక్షన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బెంగళూరు కి చెందిన జాయిన్ ది డాట్స్ (జెటిడి) ఫౌండేషన్ అధ్యక్షుడు ధనుంజయ్, వారి బృందం విద్యార్థినులకు అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థినులకు నైపుణ్యాల పై ఒక సంవత్సరం పాటు వారే ఉచిత శిక్షణ ఇచ్చి తరువాత సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక అయ్యేలా చేస్తామని తెలిపారు. క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపిక అయిన విద్యార్థినులకు హెచ్‌పి కంపెనీ ల్యాప్‌టాప్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వి.దీన దయాళ్, జెకెసి కో ఆర్డినేటర్ డాక్టర్ ఉషారాణి, కళాశాల బృందం పాల్గొన్నారు.

కావలెను

పాకాల 132/33 కెవి సబ్‌స్టేషన్, ఎపి ట్రాన్స్‌కో యందు బిసి(బి) - మహిళ (డిప్లమో ఇన్ ఎలక్ట్రికల్స్) హైస్కిల్డ్ షిఫ్ట్ డ్యూటీస్ చేయుటకు మహిళ కావలెను. అర్హత కలిగి, ఆసక్తి గల వారు క్రింది నెంబరుకు సర్టిఫికేట్స్‌తో సంప్రదించగలరు.

Contract
Sri. B.V.Ramana
Cell: 9440392940

చదువు తోనే ఉజ్వల భవిష్యత్తు :చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

విశాలాంధ్ర - పాకాల : చదువుతూనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాకాల మండలం లోని దామలచెరువు, మొగరాల, రమణయ్యగారిపల్లి, వల్లివేడు, ఇ.పాలగుట్టపల్లి, పదిపుట్లబైలు, తోట తిమ్మయ్య గారి పల్లి, పేరసానిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, బ్రెయిన్ ఎక్సర్ సైజ్ షీట్లను హర్షిత్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్తుకు చదువు ఎంతో అవసరమని, ఉన్నత చదువులు చదువుకున్న తెలివితో మంచి ఉద్యోగం చేబట్టి సమాజానికి మంచి చేయాలన్నారు. . విద్యా రంగంలో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన జగనన్న పరిపాలనను స్ఫూర్తిగా తీసుకుని ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆశీస్సులతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పరీక్షలు ప్రారంభమవుతున్న తరుణంలో నోటు పుస్తకాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, ఎంపీడీవో నాగేంద్రబాబు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి సేవలో కలెక్టర్

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని తిరుపతి జిల్లా కలెక్టర్ శ్రీ లక్ష్మీషా , శాసన సభ్యులు, కిలివేటి సంజీవయ్య దర్శించు కొన్నారు. వారిని సహాయక కమిషనరు కార్యనిర్వాహణాధి కారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, వేదపండితులచే పూజలు నిర్వహించి అనంతరం సత్కరించుట జరిగినది. అమ్మవారికి వెండి తీర్థం గిన్నెలు-2 (520 గ్రాములు) యన్.మల్లిఖార్జున రావు, కావలి వారు దేవస్థానమునకు అందజేశారు. ఈ కార్యక్రమములో ధర్మకర్తలమండలి సభ్యులు ముప్పాళ చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ సభ్యులు చిలకా యుగంధర్ జెట్టి వేణు, అలవల సురేష్, మీజూరు రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

విశాలాంధ్ర -పాకాల : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మోహిద్దీన్ భాష తెలిపారు. మంగళవారం సరోజినీ నాయుడు జన్మదిన సందర్భంగా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మోహిద్దీన్ భాష అధ్యక్షతన జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బాగా చదువుకుని అన్ని రంగాలలో రాణించాలని, రాజకీయ, ఉద్యోగ ,వ్యాపార , క్రీడా రంగాలలో మహిళల ప్రాధాన్యత ఇంకా పెరగాలన్నారు జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాధవి లత, చిట్టి కళావతి, రమణమ్మ , విష్ణు ప్రియ ,లక్ష్మీ ప్రసన్న ,మాధవి ,రవి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద మసీదువీధిలో పరిమళ విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని పెద్ద మసీదువీధిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పరిమళ వెంకటేశ్వర్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీతో ప్రత్యక్షంగా మద్దతు తెలుపుతు న్నాయన్నారు. ముఖ్యంగా మైనారిటీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఎన్ఆర్సీ, సీఏఏ బిల్లులకు పార్లమెంటులో టీడీపీ, వైసీపీలు మద్దతిచ్చాయని గుర్తు చేశారు. మైనారిటీలకు రక్ష కాంగ్రెస్ అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిపించాలని కోరారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్ ను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేసిన నాయకులు

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరులో ఈనెల 16వ తేదీన జరిగే భారత్ బంద్ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ యూనియన్స్ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) లు ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని ప్రజా సంఘాలు ముద్రించిన కరపత్రాలను పుత్తూరులో విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి రాధాకృష్ణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు జిల్లా సమితి సభ్యులు మహేష్ హైమావతిలు హాజరైనారు వారు మాట్లాడుతూ లేబర్ డిపార్ట్మెంట్ను నీరుగారిచే విధంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని దీనికి వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతున్నారు అలాగే స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని అలాగే కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి అందరిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టపరుస్తూ పట్టణ ప్రాంతాలకు విస్తరిం చాలని పని దినాలు 200 పెంచాలని రోజువారి కూలీ 600 రూపాయ లకు తక్కువ లేకుండా చేయాలని ఇలాంటి 16 డిమాండ్లతో కూడిన ఈ సమ్మె భారత్ గ్రామీణ బందును యావత్తు కార్మిక వర్గం రైతాంగం వ్యవసాయ కూలీలు పేద ప్రజానీకం రోడ్లపైకి వచ్చి 16వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలి అని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్ చంద్రబాబు నాయకులు పుత్తూరు పట్ట ణ కార్యదర్శి చిరంజీవి, శరవణక్,చంగయ్య,చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, హైమావతి, ధన, మారమ్మ, భారతి పాల్గొన్నారు

ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతా:పులివర్తి నాని

సాయినగర్ లో సమస్యలు వెల్లువ -రాత్రుళ్లు గంజాయి బ్యాచ్ ఆగడాలు
పులివర్తి నాని దృష్టికి స్థానికుల సమస్యలు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :తిరుపతి రూరల్ మండలం, సాయినగర్ పంచాయితీ సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. అండర్ డ్రైనేజ్ లేక మురుగు నీరు రోడ్లపైకి వస్తుందని, ఏళ్ల తరబడి పక్కా గృహాలు నిర్మించుకున్న పట్టాలు రెగ్యులరైజ్ చేయలేదని స్థానికులు తమ సమస్యలను చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని దృష్టికి తీసుకువచ్చారు. "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని","బాబు ఘారిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయినగర్ పంచాయితీలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పులివర్తి నాని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మినీ మేనిఫెస్టో లోని అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అరాచక పాలన గురించి ప్రజలకు తెలియజేశారు.సాయినగర్ పార్కుల వద్ద, మైదాన ప్రాంతాల్లో రాత్రిళ్ళు గంజాయి కొడుతూ దారిని పోయే వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారని స్థానికులు పులివర్తి నానికి విన్నవించారు. ఫిర్యాదు చేయాలన్న గంజాయి బ్యాచ్ ఆగడాలకు భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇంత జరుగుతున్నా పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఏ రోజు వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ రాక్షస పాలన మరో 50 రోజుల్లో ముగుస్తుందని పులివర్తి నాని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి సమస్యకు ఖచ్చితంగా పరిష్కారం చూపుతానని ఆయన స్పష్టం చేశారు.పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన...పేరూరు పంచాయితీలో తెలుగుదేశం పార్టీ వాల్ పోస్టర్స్ అధికార పార్టీ నేతలు చించివేశారు పార్టీ వాల్ స్టిక్కర్స్ ఉన్నా ఆటోను తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్న సమాచారం తెలిసి పులివర్తి నాని స్టేషన్ కు చేరుకున్నారు. స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. చంద్రగిరిలో అధికార పార్టీకి ఒక చట్టం, ప్రతిపక్షాలకు మరో చట్టం ఉందా అని ప్రశ్నించారు. సొంత నిధులతో పోస్టర్లు, స్టిక్కర్లు కార్యకర్తల సొంత ఇళ్లకు అంటిస్తే తొలగించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సిఐ చొరవ తీసుకుని ఆటోను పంపించి వేయడంతో పులివర్తి నాని శాంతించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర- చౌడేపల్లి : చౌడేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 14న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డాక్టర్ వెంకటేశు తెలిపారు స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల పరిపాలన భవనంలో జరిగే సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్సీకి ఘన సన్మానం

విశాలాంధ్ర- చౌడేపల్లి : జిల్లా లోని వడ్డెర సంఘం కార్యాలయం లో డి.వి.యస్.మణి ఆధ్వర్యం లో సన్మాన సభ ఏర్పాటు చేసి,దుశ్శాలువతో సత్కరించారు.జిల్లా లోని వడ్డెర సంఘ సభ్యులు సుదర్శన్,పెద్దన్న(కుప్పం),మనోహర్,మొగిలీశ్వర్,ఉదయ వరలక్ష్మి, శేఖర్ (మల్లకుప్పం),శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా చౌడేపల్లి మండలం,ఆర్.ఆర్ కాలనీ చెందిన నడిపి రెడ్డెప్ప తన సంఘ ఆధ్వర్యం లో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో వడ్డెర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టిటిడి ఉద్యోగులు, కార్మికులు ఆలోచించండి

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతిలో పని చేస్తున్న టీటీడీ ఉద్యోగులు, కార్మికులు ఆలోచించాలని రానున్న ఎన్నికలలో జనసేన తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థికే ఓటు వేసి గెలిపించాలని జనసేన పార్టీ నగర అధ్యక్షులు రాజారెడ్డి కోరారు. మంగళవారం మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఆర్సిపి తిరుపతి నాయకులు టిటిడి ఉద్యోగులకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ప్రస్తుతం 40 కిలోమీటర్ల దూరంలో మంజూరు చేస్తామని చెప్పి మోసం చేస్తున్నారని గుర్తు చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డి 2019లో ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. మళ్లీ అదే మోసపూరిత మాటలతో ప్రజల దగ్గరికి వస్తున్నారని, ప్రజలు దీనిని గుర్తించి రానున్న ఎన్నికలలో తమ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు.అడవి కార్మికులు అంగన్వాడీ కార్మికులు జాగ్రత్తగా ఆలోచించి ఎన్నికల్లో ఓటు వేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.ఈ విలేకర్ల సమావేశంలో జనసేన నేతలు కిషోర్ ,చేమూరు పవన్ ,దినేష్ జైన్, రాజేష్ ఆచారి, హిమవంత్, మనోజ్, సాయి దేవ్, మణి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలను రాజకీయ అడ్డాలుగా మార్చకండి

విశాలాంధ్ర - తిరుపతి : దేవాలయాలను తమ రాజకీయ స్వప్రయోజన కోసం అడ్డాగా మార్చ వద్దని తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపి యాదవ్ తెలుగుదేశం నాయకులకు హితవు పలికారు. మంగళవారం మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో వారు మాట్లాడుతూ..మంగళవారం ఉదయం తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు దాదాపు రెండు వందల మందికి పైగా ఆలయానికి విచ్చేసి దౌర్జన్యంగా నిరసనలు చేయడం సభ్య సమాజం సిగ్గుపడేలా ఉందని ఆయన విమర్శించారు.ఆలయ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి కనీసం టికెట్టు కొని దర్శనం చేసుకోలేదని రౌడీలు తరహాలో అరుపులు కేకలతో ఆలయాన్ని అపవిత్రంగా మార్చారని ఆయన మండిపడ్డారు.దేవాలయాలను సైతం రాజకీయ ప్రయోజనాలకు కోసం వాడుకునే తెలుగుదేశం దొంగలను తిరుపతి నుండి తరిమికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు జరగకుండా గంగమ్మ తల్లిని వేడుకుంటున్నాను అని ఆయన తెలిపారు.ఈ విలేకరులు సమావేశంలో వెంకటేశ్వర్‌రావు, హరినాథ్ రెడ్డి, బాబు యాదవ్, రమణమ్మ, కృష్ణవేణి , గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర - తిరుపతి : ఫిబ్రవరి 16న రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది.ఉదయం 6.30 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. హైదరాబాదుకు చెందిన భక్తురాలు స్వర్ణకుమారి అందించిన పరదాల సెట్‌ను ఆలయంలో అలంకరించారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఉదయం 6 నుండి 7 గంటల వరకు స్వామివారు అశ్వవాహనాన్ని అధిష్టించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో విజివో బాలిరెడ్డి, ఆలయ ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, ఎవిఎస్వో శైలేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో ఎనిమిది మంది అరెస్టు

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నగరి పరిధిలోని నెత్తంకండ్రిగ పంచాయతీ లక్ష్మీపురంలో ఫిబ్రవరి 3వ తేదీన వాటర్ ప్లాంట్ యజమాని జగదీశ్ను కత్తులతో నరికి హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు డీఎస్పీ నరసింహమూర్తి వివరాలు వెల్లడించారు. హత్యకు వివాహేతర సంబంధం కారణమని తెలిపారు. నిందితులు సుధాకర్, మురళి, మగేష్, అజిత్, హరిహరన్ కుమార్ అలియాస్ వసంత్, సూట్సారి, రాజముత్తు, జయశంకర్ బాలాజీలను అరెస్టు చేశామన్నారు.

టీటీడీ విద్యాసంస్థల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- సమీక్షా సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: టీటీడీ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు కార్యాచరణ రూపొందించాలని జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. టీటీడీ పరిపాలన భవనంలో విద్యాసంస్థలపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించడం ద్వారా లభించే విద్యావకాశాల గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల సర్వతోముఖా భివృద్ధికి హెడ్మాస్టర్ పాత్ర కీలకమన్నారు. డీఈవో భాస్కర్ రెడ్డికి చాలా అనుభవం ఉందని, ఆయన సూచనలతో విద్యాసంస్థలను అభివృద్ధి చేసే దిశగా పని చేయాలని కోరారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కూడా జేఈవో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జరిమానా

విశాలాంధ్ర -చిత్తూరు: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికీ 10 వేల రూపాయలు జరీమాన విధిస్తూ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఉమా దేవి మంగళవారం ఆదేశించినట్లు చిత్తూర్ ట్రాఫిక్ సిఐ నిత్య బాబు తెలిపారు.సోమవారం వాహన తనికీ సమయంలో మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకోని మంగళవారం కోర్ట్ లో ప్రవేశ పెట్టగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఉమా దేవి గ ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున 20 వేల రూపాయలు జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రతి రోజూ వందల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా వారు వారి ప్రాణాలనే కాకుండా, రోడ్డుపై వెళ్లే ఇతరుల ప్రాణాలకూ ముప్పు కలిగిస్తున్నారు.ఎవరు మద్యం సేవించి వాహేనాలు నడపరాదని అలా కాకుండా ఎవరైనా పట్టుపడితే వారికి జరిమానా తో పాటు గా 3 నుంచి 6 నెలల వరకు జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్య బాబు తెలియజేసారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం పాలన: ఎమ్మెల్సీ మేరిగ

విశాలాంధ్ర - గూడూరు : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని వాములమీట్టలో సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలు తెలిపిన సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయన్నారు. అభివృద్ధి పనుల కోసం ఒక్కొక్క సచివాలయానికి ప్రభుత్వం రూ. 20లక్షల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మౌలిక వసతుల సమస్యలను గుర్తించామన్నారు. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీఈసీ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మీరా రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, సురేష్ రెడ్డి, గోపి యాదవ్, పూర్ణ, మాజీ కౌన్సిలర్ సీహెచ్. కృష్ణ ప్రసాద్ రెడ్డి, అనీల్ యాదవ్, పెంచలయ్య గౌడ్, గోపి యాదవ్, శశి, రసూల్, చందు, బాలాజీ, దీపు, సుబ్రహ్మణ్యం, కుమార్, రమణయ్య, బెనర్జీ, మున్సిపల్ డీఈ రామ్మూర్తి, ఏఈ, కాంట్రాక్టర్ సుమన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్య సూత్రాలను వివరించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం తొండవాడ గ్రామ పంచాయతి పరిధిలో శ్రీ పద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్వహిస్తున్న ఎన్.ఎస్.ఎస్. స్పెషల్ క్యాంప్ రెండవ రోజు గ్రామంలోని మాదిగ పల్లి ప్రజలకు పర్యావరణ పరిశుభ్రతకు పాటించవలసిన పద్ధతులు నాటకం ద్వారా తెలియజేశారు. దళిత వాడలోని ప్రతి ఇంటిని సర్వే చేసి వారి ఆరోగ్య సమస్యలను గురించి సమాచారం సేకరించడం జరిగింది. ఆరోగ్య సూత్రాలు ను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి.ఆర్. లీలావతి, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి. మునిరేఖ ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు నిర్వహించారు.

రాష్ట్రంలో విద్యాప్రమాణాల్లో విప్లవాత్మక సంస్కరణలు

- తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెల్లడి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : రాష్ట్రంలో విద్యాప్రమాణాల్లో విప్లవాత్మక సంస్కరణలకు సీఎం జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని తుడా ఛైర్మెన్, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు.విద్యార్థి దశ ఓ వరం అని, జ్ఞాన జ్యోతి వెలుగొందేందుకు విద్య ఆవశ్యకమని తెలిపారు. చక్కటి ప్రణాళికతో మెరుగైన జీవితానికి మార్గం సుగమం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు.. ప్రతి పేదవాడికి విద్యను చేరువ చేసేందుకు అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుక వంటి పథకాలను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. సీఎం జగనన్న స్ఫూర్తితో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విద్యార్థులను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. మంగళవారం తిరుపతి రూరల్ పరిధిలోని తుమ్మలగుంట, వేదాంతపురం, తిరుచానూరు, ముండ్లపూడి, పాడిపేట, కొత్తూరు, వేమూరు, బ్రాహ్మణ పట్టు, మంగళం, రణధీరపురం, తిరుమలనగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలోని 1,957 మంది విద్యార్థులకు తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నోటు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, బ్రెయిన్ ఎక్సర్ సైజ్ ఫజిల్ షీట్ లు అందజేశారు.ఆయా పాఠశాలల్లో మోహిత్ రెడ్డికి ఘనంగా స్వాగతం లభించింది. ముందుగా చదువుల తల్లి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తుమ్మలగుంట పాఠశాలలో ఆయన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో ముచ్చటించారు.ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. ఏ సంపద అయినా, బంధుత్వాలైనా మన నుండి దూరమవుతాయి.. కానీ విద్యా సంపదను ఎవరూ దోచుకోలేరన్నారు. అలాంటి విద్యను ప్రతి ఒక్కరూ సముపార్జించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఆధునిక టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. విద్య లేని వాడు వింత పశువు అని ఎందరో మహనీయులు విద్య ఔన్నత్యాన్ని తెలియజేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యశోద, ఎంపిడిఓ రమేష్ బాబు, సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై జగన్ రెడ్డిది కపట ప్రేమ

- టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: వైసీపీలో జగన్ మోహన్ రెడ్డి ఒంటెద్దు పోకడలతో బీసీ నాయకులు బయటకు వస్తున్నారని బీసీలపై అసలు జగన్ రెడ్డిది నిజమైన ప్రేమ కాదని, కపట ప్రేమ ని టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ విమర్శించారు. మంగళవారం ఆయన తిరుపతి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇందుకు వైసీపీ బీసీ సెల్ ప్రెసిడెంట్ జంగా కృష్ణమూర్తి బయటకు వచ్చి బీసీ నాయకులకు పార్టీలో గౌరవం లేదని పేర్కొనడం గమనార్హం అన్నారు. బీసీల ద్రోహి జగన్ మోహన్ రెడ్డి అని, ఆ పార్టీలోని నేతలే అంటున్నారనీ ఎద్దేవా చేశారు. జంగా కృష్ణమూర్తి నిజాలు చెప్పడంతో జగన్ రెడ్డి అసలు స్వరూపం బయటపడిందన్నారు. బీసీలపై జగన్ రెడ్డి కపట ప్రేమను చూసి ఓట్లు వేసి బీసీ సోదరులంతా మోసపోయారనీ ఆవేదన వ్యక్తంచేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీలను, బడుగూ బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంకు గా మారారనీ మండిపడ్డారు. సామాజిక న్యాయం పేరుతో బీసీలను దగా చేస్తున్న జగన్ రెడ్డికి అతి త్వరలో బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. బీసీలకు తాత్కలిక పదవులిచ్చి అధికారం మొత్తం రెడ్ల చేతిలో పెట్టాడని మండిపడ్డారు. వైసీపీలో బీసీలు అవమానాలకు గురౌతున్నారని, ఎంతోమంది బీసీ నాయకులు వైకాపాకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. ఎందుకంటే వైకాపాలో బీసీలకు సరైన గౌరవం లేదు, స్వేచ్ఛ లేదని పవర్ కూడా ఉండదని ట్టెలిపారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు వైసీపీలో సరైన న్యాయం జరగలేదని ఆరోపించారు. నా ఎస్టీ, నా ఎస్సీ, నా బీసీలు అని బాజా వాయిస్తూ జగన్ రెడ్డి ఆయా సామాజిక వర్గాల వారిని వంచిస్తున్నాడని విమర్శించారు. కేవలం పదవులు ఇవ్వడం సామాజిక న్యాయమా?, జగన్ రెడ్డి మాట్లాడుతున్న సామాజిక న్యాయం అసలు సామాజిక న్యాయమే కాదని, ఆయన మాయల ఉచ్చులో బీసీ లు పడకుండా ఈసారి ఎన్నికల్లో బీసీల సత్తా చాటుదాం అని నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. నేతి బీరకాయలో నెయ్యెంత నిజమో..జగన్ మోహన్ రెడ్డి వైసీపీలో సామాజిక న్యాయం అంతే నిజం అని వ్యాఖ్యానించారు.

నగరపాలక సంస్థ ఎదుట కార్మికుల ధర్నా

విశాలాంధ్ర -చిత్తూరు : మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల పై జీ .వో లు విడుదల చేసి అమలు చేయాలని ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్. నాగరాజు డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుద్ధ్యం , ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మె కాలంలో ఇచ్చిన హామీల పై జీ వో ను విడుదల చేసి అమలు చేయాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ధర్నా కార్యక్రమానికి యూనియన్ నాయకులు .సి.సురేష్, జయశంకర్ నాయకత్వం వహించారు ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పా రిశుద్ధం కార్మికులు ఇంజనీరింగ్ విభాగం కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వానికి కార్మిక సంఘాలకు చర్చలు జరిగిన సందర్భంగా సఫలం కావడంతో ఒప్పందం కుదిరి నెల రోజుల్లోపు మంత్రివర్గ ఉప సంఘంతో చర్చించి జీవో విడుదల చేస్తామని హామి ఇచ్చి ఇప్పటికీ అమలు చేయకపోవడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జీవో విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో దశల వారి ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవోలను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు వి సి గోపీనాథ్, దాసరిచంద్ర ,రమాదేవి ,రఘు,బాలాజీరావు ,లతారెడ్డి,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దొర స్వామి, సుగుణ ,రమణి ,సురేష్ జయశంకర్, సుకన్య, శోభన్ బాబు, బుల్లెమ్మ ,ఈశ్వర్,కస్తూరి,వినోద్,వినాయకమ్మ,,పరదేశి,సుభాషిని, భాగ్యలక్ష్మి, వెంకట్రావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే నేతకు ఓటు వేయండి

తెలుగు యువత టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర–పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గం, తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ఆదేశాల మేరకు, అదేవిధంగా నియోజకవర్గ ఇన్చార్జివర్యులు చల్లా రామచంద్ర రెడ్డి ఆదేశానుసారం, తెలుగు యువత మరియు టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యువ ఓటర్లకు చైతన్య సదస్సులు శ్రీకారం చుట్టిన సందర్భంగా పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, మీడియా కోఆర్డినేటర్ గుణిగింటి దేవేంద్ర, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు పాలడుగు రెడ్డప్ప నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కాలవగడ్డ మునీంద్ర మీడియాతో మాట్లాడుతూ.18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోండి. ఓటు మన జన్మహక్కు ఖచ్చితంగా ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోండి.రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే మంచి నాయకుడిని ఎన్నుకోండి.ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, నూతన పరిశ్రమలు తీసుకువచ్చే నాయకుడిని ఎన్నుకుందామన్నారు. ఓటేసే ముందు ఒక్కసారి ఆలోచించండి, మంచి చేసే నాయకుడు ఎవరు, ముంచేసే నాయకుడు ఎవరు ఆలోచించి ఓటేద్దామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ పర్సన్ రమేష్ మర్పూరి, టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు హేమాద్రి, ఇమ్రాన్, రాజంపేట పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షురాలు షబానా, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు ఆసూరి బాలాజీ రాయల్, ప్రకాష్, పోలీస్ గిరి రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు పాలడుగు రెడ్డప్ప నాయుడు టిఎన్ఎస్ఎఫ్ నియోజవర్గ అధ్యక్షులు కాలువ గడ్డ మునీంద్ర, నియోజకవర్గ తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

తొలి ఓటు చంద్రబాబు నాయుడుకు వేయండి

రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్

విశాలాంధ్ర – గూడూరు : టీడీపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గూడూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు అసనాపురం వెంకటేష్, నారా లోకేష్ స్పోర్ట్స్ ఫౌండేషన్ గుడ్డూరు రవిచంద్రల ఆధ్వర్యంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను కలిసి వారి మొదటి ఓటు తెలుగుదేశం పార్టీకే ఎందుకు వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత పార్లమెంట్ నాయకులు వేముల సునీల్, గుండాల సందీప్, అల్లం వెంకట సాయి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ధనుష్ మండలపాటి, మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా మహిళా కార్యదర్శిగా శారదమ్మ

విశాలాంధ్ర – బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఎస్ టి యు కమిటీ ఎన్నికలలో మండలానికి ప్రాధాన్యతనిస్తూ జిల్లా కమిటీని మంగళవారం ఎంపిక ప్రక్రియ జరిగినట్లు మండల ఎస్టియు నాయకులు రాసులు రామ చంద్రయ్య, జగన్నాధం తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఎస్టీయూ తిరుపతి జిల్లా కార్యవర్గంలో అసోసియేట్ అధ్యక్షులుగా – లక్ష్మయ్య, గుమ్మడి మురళి, అదనపు ప్రధాన కార్యదర్శిగా – పెరిమిడి దేవేంద్ర, మహిళా కార్యదర్శిగా –చింతపూడి శారదమ్మ ,సాంస్కృతిక కమిటీ కన్వీనర్ గా –పోలూరు జగన్నాధులు ఎంపిక కాగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన యువశ్రీ మురళి ని రాష్ట్ర కౌన్సిలర్ గా ఎంపికైనారని తెలిపారు.వీరి ఎంపిక పట్ల మండలశాఖ హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించింది.

జయహో బీసీ కార్య క్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర–కార్వేటినగరం : గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలం రాష్ట్ర టిడిపి ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర గారి సూచనలు మేరకు గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ఆదేశాల మేరకు, చిత్తూరు పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు షణ్ముఖ రెడ్డి సూచన మేరకు ఈనెల 15వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు టిడిపి కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి హిందూ ముస్లిం కళ్యాణమండపం ముందు జయహో బీసీల సంఘం సమావేశం జరుగుతుందని జీడి నెల్లూరు బీసీ సెల్ అధ్యక్షులు మేళం రవి యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం ఆరు మండలాల అధ్యక్షులు, ఆరు మండలాల బీసీ మండల అధ్యక్షులు,, జిల్లా మండల బూత్ కన్వీనర్లు, ఇన్చార్జిలు, టిడిపి కార్యకర్తలు అభిమానులు, అందరూ హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యాశాఖ స్టేట్ టీం కార్వేటినగరంలో పర్యటన

విశాలాంధ్ర – కార్వేటినగరం : కార్వేటినగరం మండలం సమీపంలోని పద్మ సరస్సు తూర్పు అరుంధతి వాడలోని అంగన్వాడీ కేంద్రాలను రాష్ట్ర విద్యాశాఖ టీం మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో గల వస్తువులను, వసతులను పిల్లల సంఖ్యను పిల్లల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎఫ్ ఎల్ ఎన్ కన్సల్టెంట్ బాలకృష్ణ ప్రథం ప్రతినిధి గీత పద్మ సరస్సు అంగన్వాడి కేంద్రాలను ఆదర్శ ఫౌండేషన్ స్కూల్ ఎన్నిక చేశారు.భవిష్యత్తులో ఈ ఆదర్శ ఫౌండేషన్ స్కూలుకు అనేక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆదర్శ ఫౌండేషన్ స్కూల్ లోని పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఇస్తుందన్నారు. పిల్లలు చిన్న చిన్న కథలు చక్కగా చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ సీఎంఓ జయప్రకాష్, డైట్ ఇన్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, మండల విద్యాశాఖ అధికారులు ఎం విజయకుమార్, మనోజ్ కుమార్,సిడిపిఓ పద్మసునంద,పర్యవేక్షకులు షామిని,ఎఇనాగభూషణం, సిఆర్పిలు పాల్గొన్నారు.

కంకర క్వారీలకు అనుమతులు ఇవ్వద్దు

బహిరంగ వేదికలో గ్రామస్తులు స్పష్టం

విశాలాంధ్ర– సత్యవేడు: మా ప్రాంతంలో కనీస వసతులు కల్పిస్తే తప్ప ఎలాంటి కొత్త కంకర క్వారీలకు పర్యావరణ సంబంధించిన అనుమతులు ఇవ్వద్దని మండల పరిధిలో పివిపురం పంచాయతీ వాసులు పలువురు స్పష్టం చేశారు.మంగళవారం క్షీరసాగర్ రెడ్డి పేరుతో ప్రతిపాదిత కంకర క్వారీకి సంబంధించిన పర్యావరణ అనుమతులపై చమర్థకండ్రిగ ఎస్టి కాలనీకి సమీపంలో డిఆర్ఓ పెంచల కిషోర్, తిరుపతి కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రమోహన్ అధ్యక్షతన ప్రజాభిప్రాయ వేదిక నిర్వహించారు.ఈ సందర్భంగా పివిపురం పంచాయతీ వాసులు పలువురు మాట్లాడుతూ ఇప్పటికే చమర్థకండ్రిగ ఎస్టి కాలనీ చుట్టూ నాలుగు కంకర క్వారీలు నడుస్తుండన్నారు.ఈ నేపథ్యంలో క్వారీల నుంచి వేలాది కంకర ట్రిప్పర్లు పరుగులు తీయడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నట్టు అధికారుల దృష్టికి తెచ్చారు.దీంతోపాటు తరచూ తాగునీటి పైపులైన్లు కూడా దెబ్బ తినడం వల్ల తాగునీటి సైతం ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి వచ్చిందన్నారు.ఇదే గాక రోడ్లు దెబ్బతిని రహదారుల సౌకర్యం లేకపోవడంతో పిల్లలు స్కూల్కు వెళ్లాలన్న ఇబ్బందులు తప్పడం లేదన్నారు.అలాగే భూగర్భ కంకరను వెలికి తీసే ప్రయత్నంలో సంబంధిత యాజమాన్యాలు మందుగుండు పేల్చడం వల్ల శబ్ద ధ్వని అధికమవుతున్నట్టు చెప్పారు.తద్వారా ఈ ప్రాంత వాసుల్లో భయాందోళనలు నెలకొంటున్నట్టు స్పష్టం చేశారు.దీంతోపాటు భారీ మిషన్ల ద్వారా పెద్దసైజు కంకరను చిన్న సైజుగా మార్చడంలో అత్యధికంగా కంకర ధూళి గాలిలో కలిసి తమ కాలనీ వైపు వెదజల్లుతున్నడంతో ఇప్పటికే పలువురు అనారోగ్యం పాలైనట్టు చెప్పారు.అందువల్ల శాశ్వత ప్రాతిపదికన రోడ్లు,తాగునీటి వసతి, పర్యావరణానికి ముప్పు లేనివిధంగా నిర్దిష్ట చర్యలు తీసుకోవడం, పచ్చదనం పెంపుదలకు చెట్లు నాటడం,క్వారీ సమీప కాలనీవాసుల ఆరోగ్య భద్రతను పరిరక్షిస్తే తప్ప కొత్తగా కంకర క్వారీలకు పర్యావరణ అనుమతులు ఇవ్వద్దని తెల్పి చెప్పారు.అయితే దీనిపై మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రమోహన్ స్పష్టం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డిటి రవిచంద్రబాబు, ఆర్ఐ కిరణ్ కుమార్,ఇన్చార్జ్ విఆర్ఓ భార్గవ్,పంచాయతీ సెక్రెటరీ లీలా మాధవ్ పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్ల సంస్కృతి లేకుండా చేయాలని గంగమ్మకు పూజలు

విశాలాంధ్ర – తిరుపతి : తిరుపతి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సుగుణమ్మ ఆధ్వర్యంలో తిరుపతి నియోజకవర్గంలో దొంగ ఓట్ల సంస్కృతి లేకుండా చేయాలని గంగమ్మ తల్లిని ప్రార్థించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్ తో కలిసి సుగుణమ్మ మాట్లాడుతూ. ప్రపంచంలో ఏ నియోజకవర్గంలోనూ ఇంతవరకు ఇన్ని వేల ఓట్లు ఈసీ కన్ను కప్పి చేసి ఉండకపోవచ్చు పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి నగరం దొంగ ఓట్ల కర్మాగారం లాగా తయారైందని 2019 నుండి ఇంతవరకు తిరుపతి నియోజకవర్గంలో ఏ ఎన్నిక జరిగిన దొంగ ఓట్లతోనే జరిగాయని మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు గాని టౌన్ బ్యాంక్ ఎన్నికల కానీ తిరుపతి పార్లమెంటు ఉపఎన్నిక గాని అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ అధికారులు చేసిన తప్పుకు మొన్న కలెక్టర్ . తిరుపతి ఉప కమిషనర్. నిన్న ముగ్గురు సీఐలు ఎస్సైలు హెడ్ కానిస్టేబుల్ సస్పెండ్ కావడం దేశ చరిత్రలో తిరుపతి లో తప్ప వేరే దగ్గర ఉండకపోవచ్చని ఈ సందర్భంగా వారు తెలియజేశారు వైసిపి నాయకులు అభివృద్ధి చేసి సంక్షేమం చూపించి ప్రజల దగ్గర ఓట్లు తెచ్చుకోలేక అడ్డదారులు తొక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వారికి సహకరించిన అధికారులు ఈరోజు శిక్ష అనుభవిస్తున్నారని దీనికి సూత్రధారులు కూడా ఎన్నికల లో పోటీ కి అనర్హులుగా ప్రకటించాలని ఈ సందర్భంగా వారు ఈసీని కోరారు అదే కాకుండా రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతిలో స్వేచ్ఛ యుతంగా దొంగ ఓట్లు సంస్కృతి లేకుండా ఎన్నికలు జరిగే విధంగా ఎలక్షన్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఈ తిరుపతి పవిత్రతను కాపాడి తిరుపతిలో ధర్మాన్ని వేళ్ళు విరిసేలా అనుగ్రహించమని తిరుపతి గ్రామ దేవత తాతయ్య గుంట గంగమ్మని వేయికళ్ల దుత్తలతో వేడుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ముబ్బు దేవ నారాయణ రెడ్డి. కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణ. భాస్కర్ యాదవ్. బుల్లెట్ రమణ. శ్రీధర్ వర్మ. ఊట్ల సురేంద్ర నాయుడు. పులిగోరు మురళీకృష్ణారెడ్డి. ఊక విజయ్ కుమార్. కోడూరు బాలసుబ్రమణ్యం. జె బి శ్రీనివాసులు. చిన్న బాబు. మహేష్ యాదవ్. కృష్ణ యాదవ్.ఆనంద్ యాదవ్. రజనీకాంత్. కరాటే చంద్ర. శంకర్. బ్యాంకు శాంతమ్మ. భారతి. రేవతి. పెద్ద ఎత్తున నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన సచివాలయాల ప్రారంభం : భూమన

విశాలాంధ్ర – తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో నూతనంగా నిర్మించిన రెండు సచివాలయాలను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మంగళవారం ప్రారంభించారు. ఇందుకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్ మాట్లాడుతూ 27వ డివిజన్ కి సంబంధించిన రెండు సచివాలయాలను మల్లయ్యగుంట కట్ట వద్ద 62.70 లక్షలతో నిర్మించామన్నారు. అలాగే 44వ డివిజన్ రైల్వే కాలనీ వద్ద 25 లక్షలతో నిర్మించిన మరో నూతన సచివాలయ భవనాన్ని కూడా ప్రారంభించినట్టు చెప్పారు. ప్రజా అవసరాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు మునిసిపల్ కార్పొరేషన్ తగు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ, కార్పొరేటర్ మునిరామిరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, ముదూరు మునిరామిరెడ్డి, జల్లి తులసీ యాదవ్, దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, చింతా రమేష్ యాదవ్, చింతా భరణీ యాదవ్, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి, స్టోర్ నాధమని, దినేష్ రాయల్, శ్యామల, బత్తల గీత, డిఈలు రాజు, శ్రావణి, కాంట్రాక్టర్లు అరుణ్ కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచైతన్యలో ఫ్యామిలీ ఫెస్ట్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : స్థానిక శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాల నందు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, గురువులకు పాదపూజ నిర్వహించి, వారి నుంచి దీవెనలు అందుకున్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు సాధారణ విద్యతోపాటు వారు నైతికంగా ఉత్తమ పౌరులుగా ఎదగడానికి తోడ్పడేందుకు ఈ వినూత్న కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేసి, తమ పిల్లల పట్ల చూపుతున్న శ్రద్ధకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువల పట్ల అవగాహన కలిగించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది తద్వారా వారు తమ తల్లిదండ్రులకు, గురువులకు, సమాజానికి, దేశానికి ఉపయోగపడే ప్రయోజకులుగా తయారు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. దీనికిగాను ఈ పాఠశాల స్థాయి ఎంతగానో ఉపకరిస్తుందని, కావున శ్రీచైతన్య యాజమాన్యం ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్, కోఆర్డినేటర్ బాలాజీ, డీన్ సుబ్రమణ్యం, ఇన్‌ఛార్జి కల్పన, ఉపాధ్యాయులు అహ్మద్‌తాజ్, వెంకటేష్, ఎఓ సురేష్ పాల్గొన్నారు.

వార్షిక క్రీడా పోటీల గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-కోట: కోట మండలం విద్యానగర్ ఎన్.బి.కే.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షిక క్రీడా పోటీలకు గోడపత్రికను మంగళవారం కళాశాల డైరెక్టర్ డా.వి విజయ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. కళాశాలలో ప్రతిసంవత్సరం విద్యార్థిని, విద్యార్థులకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తారు.పురుషులకు వాలీబాల్, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్,బాల్ బాడ్మింటన్,కబడ్డీ,క్రికెట్, టేబుల్ టెన్నిస్,బాడ్మింటన్, చెస్, మహిళలకు వాలీబాల్, త్రోబాల్, బాస్కెట్ బాల్,బాల్ బాడ్మింటన్,కబడ్డీ,ఖో-ఖో,టేబుల్ టెన్నిస్, బాడ్మింటన్,చెస్,అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తారని కళాశాల వ్యాయమ విభాగాధిపతి.. మల్లికార్జున రెడ్డి తెలిపారు. డైరెక్టర్ . విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడలలో పాల్గొని పథకాలు,బహుమతులు సాధించాలని కోరారు. ఈ క్రీడలు ఫిబ్రవరి 19వతేదీ నుండి మార్చి17వతేదీ వరకు నిర్వహించబడుతాయని క్రీడలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం,టీం ట్రోఫీ అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి స్టూడెంట్ కో ఆర్డినేటర్స్ గా అజయ్,భాను,తేజ,అజిత్,సౌమిత,జాహ్నవి,దివ్య వ్యవహరిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాలలోని అన్ని విభాగాధి పతులు, వ్యాయమ విద్యా విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ఈ నెల 7 ,8 ,9 న ఒంగోలు ఫెస్ట్-2024 నందు టేబుల్ టెన్నిస్ లో ట్రోఫీ ని సాధించిన వంశి కృష్ణ,చందు లను అభినందించారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : మ్యాజిక్ బస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మాండలైజ్ కంపెనీ సహకారంతో మంగళవారం గూడూరు జెడ్పీ బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అంతేకాకుండా కబడ్డీ, వాలీబాల్ పోటీలలో నైపుణ్యం చూపే విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి స్కూల్ కి స్పోర్ట్స్ మెటీరియల్స్, కబడ్డీ జెర్సీలు పంపిణీ చేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారికి సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ డిప్యూటీ డీఈఓ వి. శివప్రకాష్ రెడ్డి, ఎఏఈఓ కాంచన, స్కూల్ ఇంచార్జ్, హెచ్ఎం వరప్రసాద్, పిడి శివ కుమార్, మ్యాజిక్ బస్ ప్రతినిధులు పిసి సుమంత్, శిక్షకులు హరికృష్ణ, లత, సిసిలు వి. మౌనేంద్ర, ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉదల పాలిట పెన్నిది సీఎం రిలీఫ్ ఫండ్

విశాలాంధ్ర - కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలకు అందిస్తున్న సీఎం రిలీఫ్ పండ్ పేదల పాలిట పెన్నిదిగా నిలుస్తోందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మంగళవారం ఇటీవల రోడ్డు ప్రమాధంలో తీవ్రంగా గాయపడిన మండల కేంద్రంలోని ముస్లిం కాలనీకి చెందిన షరీప్ కుమారుడు అషరాప్కు సీఎం రిలీఫ్ పండ్ కింద రూ.3లక్షల 20 వేలు చెక్కును స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ. ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హమీద్ ఖాన్ ఆధ్వర్యంలో ఎంపీపీ లతబాలాజీ బాధిత కుటుంభానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాధంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఉన్న విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రి వెంటనే సీఎం రిలీఫ్ పండ్ను మంజూరు చేసి బాధిత కుటుంభాన్ని ఆధుకున్నారని తెలిపారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో ఎమ్మెల్యేలు వచ్చారని తక్షణమే స్పందించి బాధిత కుటుంభాలను ఆధుకుంటున్న సీఎం జగనన్నకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి ఎప్పుడు బాధిత కుటుంభాలు రుణపడి ఉంటుందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా ముఖ్యమంత్రి సహాయ నిధులు లక్షల్లో అందించి వారికి భరోసా కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. ఈ క్రమంలో భాగంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి. ముస్లిం నాయకులు పలువురు పాల్గొన్నారు. బాధిత కుటుంభానికి సీఎం రిలీఫ్ పండ్ చెక్కును అందిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపీపీ లతబాలాజీ

టీడీపీలో నాయీ బ్రాహ్మణల చేరిక

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని వైసీపీకి చెందిన 50 కుటుంబాల నాయీ బ్రాహ్మణులు టీడీపీ పట్టణాధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, పార్లమెంట్ కమిటీ నాయీ బ్రాహ్మణ సాధికార సభ్యులు ఈదర శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ పాశిం సునీల్ కుమార్ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు నాయీ బ్రాహ్మణల కోసం ఆదరణ పథకం కింద సహాయం చేశారన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మోసం చేసిందన్నారు. ఇక ఈ మోసపు మాటలు నమ్మలేక నాయీ బ్రాహ్మణులు చంద్రబాబు నాయుడుకి మద్దతుగా వచ్చి చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు నియోజకవర్గ సాధికార సమితి సభ్యులు దేవరపల్లి భాస్కర్, వావిల్ల శివయ్య, మగులూరి మాధవ, మంగళపూరి గురునాదం, గోపాల్, దనంజయల ఆధ్వర్యంలో వేడిచర్ల వెంకటేశ్వర్లు, పెళ్లూరు నాగరాజు, పైడిపుల్ల మురళి కృష్ణ, కోడూరు రాజా, గోపాల్, మాధవ్ తదితరులను కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు ఎండీ. అబ్దుల్ రహీం, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కులకు వచ్చిన మహిళలకు అన్ని సమస్యలే

కార్యక్రమం నాది అయినప్పటికీ నిర్వాహణ బాధ్యత మొత్తం నాయకులదే.. ఏసి

విశాలాంధ్ర - వాకాడు: మండల పరిధిలోని వాకాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో వైయస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని వైయస్సార్ కాంతి పథం ఏసి చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.గత 20 రోజుల క్రితం వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గూడూరు శాసనసభ్యులు వెలగపల్లి వరప్రసాద్ రావు ఆధ్వర్యంలో చెక్కులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయగా ఆసరా పథకంలోని మహిళలు ఏ ఒక్కరు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ రావు భారీగా నిర్వహించాలని.ఈ కార్యక్రమానికి ఒక ముఖ్య వైసీపీ నాయకుడు జనాలను భారీగా తరలించి ఈ కార్యక్రమం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం కంటే గూడూరు నియోజకవర్గ 2024 వైసీపీ అభ్యర్థి మేరీగా మురళీధర్ రావు ప్రజలకు పరిచయం కార్యక్రమంగా నిర్వహించడం ఆశ్చర్యానికి గురిచేసింది 400 మంది మహిళలకు మాత్రమే కుర్చీలు వెయ్యగ వెయ్యి మందికి పైగా మహిళలను భారీగా తరలించడంతో సమావేశం నిర్వహించే చోట కుర్చీలు కూడా వేయకపోవడంతో సమావేశానికి వచ్చిన మహిళలు ఏర్రటి ఎండలో నిలబడవలసిన దుస్థితి ఏర్పడింది కనీసం తాగునీటి సౌకర్యం కానీ మధ్యహానం భోజన వసతులు కల్పించకపోవడంతో కొంతమంది నాయకులు వేదిక మీద ఉపన్యాసాలు ప్రసంగిస్తున్నప్పటికీ మహిళలు నిరుత్సాహంతో సభ మధ్యలోనే వెనుదిరికి వెళ్లిపోయారు దీంతో నాయకులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రవేశపెట్టిన పథకాలను గురించి వివరించి అధికారులు సభను ముగించారు. వైయస్సార్ కాంతి పథకం ఏసి చంద్రబాబు వివరణ ఈ విషయమై స్థానిక వాకాడు మండల కాంతి పథకం ఏసీ చంద్రబాబును సభకు విచ్చేసిన మహిళల సమస్యలపై వివరణ కోరగా వైయస్సార్ కాంతి పథకం చెక్కులు పంపిణీ చేసేందుకు వచ్చిన మహిళలకు ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం నుండి తమకు ఎలాంటి నిధులు విడుదల చేయలేదని మండలంలోని ఒక వైసీపీ నాయకుడు తమ పోద్బలంతో అన్ని తానే చూసుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించారని తమ పరిధిలో చెక్కులు పంపిణీ చేయడం మాత్రమే తమ పరిధి అని చంద్రబాబు తెలిపారు.

కోట్లు దోపిడి ఒకరిది.. నిందలు మరొకరికా...?

నిజాయితీ పరుడైన ఎమ్మెల్యే వైపు నిలబడండి

మంత్రి అవినీతిపై కొనేటి సుమన్ ఫైర్

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణ వనం మండలం సత్యవేడు నియోజకవర్గంలో ధనార్జనే లక్ష్యంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఖనిజ సంపాదనలో కోట్ల రూపాయలు దోచుకొని నిధులను స్థానిక దళిత ఎమ్మెల్యే కొనేటి ఆదిములపై నట్టేసారని జడ్పిటిసి జిల్లా జడ్పీ ఫైనాన్స్ కమిటీ నెంబర్ కొన్ని సుమన్ కుమార్ మండిపడ్డారు మంగళవారం ఉదయం సర్వసభ్య సమావేశం ఎంపీపీ దివాకర్ రెడ్డి అధ్యక్షత ప్రారంభమైనది. ఈ సందర్భంగా జడ్పిటిసి సుమన్ కుమార్ మాట్లాడుతూ సత్తివీడు నియోజకవర్గంలో ఇసుక గ్రామం కంకర్ వంటి విలువైన కణజా సంపాదన దోచుకొని నిత్యం చెన్నై బెంగళూరు తరలించి కోట్ల రూపాయలు సంపాదించే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి వదిలేసి ఎక్కడ ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలంపై నిందలను మోపడం ఎంతవరకు న్యాయమన్నారు. కానీ నిజాయితీపరుడైన ఎమ్మెల్యే ఆదిమూలం సుమారు నాలుగున్నర ఏండ్లు వేచి చూసినప్పటికీ చివరికి బానిస బతుకుల నుంచి బయటకు రావడం జరిగిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే తో పాటు తాను సీఎం జగనన్న అభిమానులు అయినా ఏమి లాభమన్నారు. సీఎం జగన్ కూడా మంత్రి పెద్దిరెడ్డికే వత్తాసు పలుకుతున్నారు. రాష్ట్రంలో సుమారు 30 మంది దళిత ఎమ్మెల్యేలు ఉంటే సీఎం జగన్ కూడా 29 దళిత ఎమ్మెల్యేలను మార్చనున్నారు. అదే మిగిలిన రెడ్లు ఉన్న స్థానంలో మార్చగలరా అంటూ ప్రశ్నించారు. దళితులకు కూడా సీఎం అన్యాయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే చనువుతో నియోజకవర్గంలో ఎక్కడ కానీ ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయడం లేదని అలాగే గొడవలకు తావు లేకుండా పరిపాలన కొనసాగించారన్నారు. ఎంతో మందిని సర్పంచులుగా ఎంపీటీసీ నామినేటెడ్ పోస్టులు ఇప్పించన్నారు. ఇకపోతే ఎంపీపీగా సాయికుమార్‌ను ఎన్నుకుంటే అప్పట్లో సుదర్శన్ రెడ్డి అడ్డుకొని తన కుమారునికి పదవిని ఇప్పించుకున్నారు. విషయాన్ని బహిర్గతం చేశారు. అలాగే ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా సొంత డబ్బులతో కొన్ని చోట్ల పనులు జరగడం కోసం సొంత డబ్బులను ఖర్చు చేసిన ఘనత ఆదిమూలం దన్నారు. పైన ఆశించకుండా పదవులను అందించిన ఎమ్మెల్యే ఆదిమూలముకు కృతజ్ఞతలుగా ఉండాలన్నారు వచ్చేది ప్రజలు ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ అన్నారు. కావున నాయకులు కార్యకర్తలు మంచిగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అనంతరం మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొని జరుగుతున్న కార్యక్రమం పైన చర్చించారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప ఎంపీడీవో కృష్ణమూర్తి ఎస్సై పరమేశ్వర్ నాయక్ గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - తిరుపతి : రాష్ట్ర సమితి పిలుపుమేరకు తిరుపతిలో ఉన్నటువంటి ఎంఆర్‌పల్లి సర్కిల్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని అలాగే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు నవీన్ కుమార్ ,ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రస్తుత పరిస్థితుల్లో భారత విద్యార్థులమైన మనం సంక్షోభంలో చిక్కుకున్నాం. జాతీయ విద్యా విధానం 2020 అందరికీ అందుబాటులో ఉన్న విద్యను అందించడానికి బదులుగా ప్రతి స్థాయిలో అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులను విద్యా వ్యవస్థ నుండి మినహాయించబడే విధంగా ఇది రూపొందించబడింది. ప్రభుత్వ రంగం మాత్రమే అందరికీ ఉచిత, నిర్బంధ మరియు శాస్త్రీయ విద్యను, అందరికీ ఉపాధి హామీ మరియు ఆరోగ్య సౌకర్యాలను అందించగలదన్నారు. నూతన జాతీయ విద్యావిధానం(2020) రద్దు చేయాలని విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో విద్యార్థి సంఘ ఎన్నికలు జరపాలన్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. 10.రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగరనాయకులు సురేష్, శంకర్, శివ, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు

కలెక్టర్ ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : సూళ్లూరుపేట తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీషా తడ మండలం ఇరకం దీవిలో పర్యటించారు త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్లను పరిశీలించారు. అనంతరం సూళ్లూరుపేటలోని కాలేజీ గ్రౌండ్లో బ్యాలెట్ బాక్సును భద్రపరిచే స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఇటీవల ప్రారంభమైన సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఇక్కడ ఉన్న వసతులను అధునాతన పరీక్షలు చేసే పరికరాలను పరిశీలించారు. అధునాతన టెక్నాలజీతో కూడిన వసతి సౌకర్యాలు ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగ్గా ఉన్నాయని ఈ అవకాశాన్ని సూళ్లూరుపేట సమీప గ్రామాలలోని పేద ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ షఫీ, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ని జర్నలిస్టులు కలిసి తమకు ప్రభుత్వ ఇచ్చే ఇళ్ల స్థలాల గురించి ప్రస్తావించగా అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వవలసినది గా ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని నుంచి ఆదేశాలు అంది ఉన్నాయి .ఇక్కడ కూడా ఆర్డిఓ ని ఆదేశించడం జరిగింది ఎక్కడైనా స్థల సేకరణ జరిపి త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థాలాలను మంజూరు చేస్తామని కలెక్టర్ లక్ష్మీషా తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు కలెక్టర్కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకొండయ్య, జర్నలిస్టు శశిధర్ రెడ్డి, ఎమ్మెస్ రెడ్డి, బొజ్జ సుధాకర్, కామిరెడ్డి మోహన్ రాజారెడ్డి, అంజూరు సురేష్, ఎడమనీ భాస్కర్, నాగరాజ్, కిరణ్, రాజా, శ్రీనాథ్ నాయుడు, సర్దార్, బిట్టు, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ చేసిన ఎంపి, ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గంగవరం : మండలంకు సంబంధం ఆసరా పథకము నాల్గవ విడత మంజూరైన నిధులు పంపిణీ" కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొని మహిళలకు మెగా చెక్కును పంపిణీ చేశారు. మండలంలోని 1065 సంఘాలలోని 10650 మంది సభ్యులకి గానూ ఆసరా పథకము నాల్గవ విడతలో రూ.10కోట్ల 35లక్షల 29వేల 329లను అందించడం జరిగింది.. మండలంకి గాను వైఎస్ ఆర్ పథకం క్రింద ఇప్పటివరకూ మొత్తం రూ.41కోట్ల 41లక్షల 17వేల 316లను అందించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, పెద్దఎత్తున మహిళలు పాల్గొనడం జరిగింది.

ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పిడి

విశాలాంధ్ర -చిత్తూరు: గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద వంద రోజులు పని దినాలు కల్పించాలని డ్వామా పిడి ఎస్.రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం తవణంపల్లె మండలం దిగువతడకర, తవణంపల్లి, పుణ్యసముద్రం గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పిడి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా తవణంపల్లి హౌసింగ్ కాలనీ, ఫారం పాండ్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, దిగువతడకర నందు సరిహద్దు కందకాలు, ఫారంపాండు, పుణ్యసముద్రము నందు కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో వేతనాలు సక్రమంగా వస్తున్నాయా లేదా దినసరి వేతనం ఎంత వస్తున్నది అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు ఎక్కువగా పని కల్పించాలని, క్షేత్ర సహాయ సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉపాధి కూలీలను పెంచి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదని హెచ్చరించారు. గ్రామపంచాయతీలో జాబ్ కార్డు కలిగి ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఏపిఎం బి సుబ్రహ్మణ్యం, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 18న మాతృభాషా పరిరక్షణ సదస్సు

విశాలాంధ్ర - తిరుపతి : ఈనెల 18వ తేదీ ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పలమ నేరులోని కళామందిరంలో మాతృభాషా పరిరక్షణ సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు పి. తులసినాథం నాయుడు తెలిపారు. వందమంది కవులు, రచయితలు, మాతృభాషాభిమానులు చర్చలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కవితల పోటీలో గెలుపొందిన కవులను సత్కరించనున్నట్లు తెలిపారు.

శ్రీ వెంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ వారికి

సిపిఐ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర - తిరుపతి : శ్రీ వెంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ వారికి కేటాయించిన స్థలాలను అన్యాక్రాంతం కాకుండా పాత లబ్ధిదారులకే అప్పగించేలా తుడా అధికారులు చూడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రేణిగుంట రోడ్డు లోని ఆటోనగర్ ప్రాంతంలో వెల్డింగ్ వర్క్స్ కార్మికులు చేస్తున్న నిరసన ధర్నాలో సిపిఐ బృందం పాల్గొని మద్దతును ప్రకటించింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ 1996 లోని తుడా ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్య ఉండకూడదని చిన్నచిన్న వెల్డింగ్ వర్క్ చేసుకునే కార్మికులకు ఆటోనగర్ వద్ద స్థలాన్ని కేటాయించి అందుకు అవసరమైన ఈ ఎం డిలు కట్టించుకొని వారికి రాత పూర్వకమైన పత్రాలను ఆనాటి తుడా అధికారులు అందజేశారు. అయినా వారికి డెవలప్మెంట్ లో భాగంగా ప్రభుత్వం షెడ్ లు నిర్మించుకుండా తుడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు అయితే నేటి తుడా అధికారులు ఆ భూమి విలువ పెరగడంతో వై యస్ ఆర్ పార్టీకి అనుకూలమైన వారికి కట్టించాలని ముందుగా ఇచ్చిన వారితో సంప్రదించకుండా ఎలాంటి నోటీసులు అందించకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెల్డింగ్ వర్క్స్ కార్మికులకు అండగా ఉండాలని అలాగా కాకుండా దౌర్జన్యంగా షాపింగ్ కాంప్లెక్స్ పేరుతో ఇతరులకు ధారాదత్తం చేయాలని చూస్తే సిపిఐ పార్టీ ఊరుకోదని హెచ్చరించారు వైయస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలకు అంతే లేకుండా పోతున్నదని అందులో భాగంగానే అరాచకాలు కూడా పెరిగిపోతున్నాయని ఇలా చేయడం ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు. శ్రీ వెంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అక్కడ నూతనంగా షెడ్యూలు నిర్మించుకోవడానికి తుడా అధికారులు సంపూర్ణంగా సహకరించాలని అలా కాకపోతే జరిగే పరిణామాలకు తుడా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు సిపిఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్, ఏఐటియుసి నగర కార్యదర్శి ఎన్ డి రవి మాట్లాడుతూ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బాధ్యతాయుతంగా కాకుండా బాధ్యతా రాహిత్యంతో వ్యవహరిస్తే ఆయనకు మంచిది కాదని హితవు పలికారు గతంలో ఇచ్చిన కేటాయించిన లబ్ధిదారులకు కాకుండా ఇప్పుడు కొత్తగా వేరే వ్యక్తులకు ఆ స్థలాన్ని కేటాయించడం అక్రమ కట్టడాలు కట్టడం అత్యంత అప్రజాస్వామికమని తక్షణమే తుడా అధికారులు పునరాలోచించి అక్రమ నిర్మాణాలు నిలిపివేసి పాత వారికే ఆ స్థలాలు అప్పగించి వెల్డింగ్ కార్మికులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని వారి హెచ్చరించారు ఈ ధర్నా కార్యక్రమంలో టివిఎస్టియుసి నాయకురాలు సింధుజ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి ఆటోనగర్ శాఖ కార్యదర్శి ఎన్ శివ, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు కే పద్మనాభరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం రామకృష్ణ, గుజిరి సంఘం కార్యదర్శి అల్లాబక్ష్, బాల, వెల్డింగ్ వర్కర్స్ లబ్ధిదారులు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకకరం:ఎంవిఐ

విశాలాంధ్ర - గూడూరు : సెల్ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని గూడూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సునీల్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా గూడూరు రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్ నుండి నర్సింగ్ విద్యార్థులు, ఆటో డ్రైవర్లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డిపోలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ సునీల్ మాట్లాడుతూ జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్ ఎంతో ప్రమాదకరమన్నారు. ఆటోలలో పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కించుకోవడం రోడ్డుపై హఠాత్తుగా ఆటోలు తిరగబడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచించారు. రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలతో క్షతగాత్రులు వేలాది రూపాయలు అప్పులు చేసి వైద్యం చేయించుకుంటారని తర్వాత అప్పు తీర్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ క్షేమంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఇటీవల కావలి వద్ద బస్సు రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ ఎస్ఐ శ్రీహరిబాబు, ఆర్టీసీ డిఎం వెంకటేశ్వర్లరావు, నర్సింగ్ విద్యార్థినులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

జేఈఈ లో సత్తా చాటిన వివేకానంద విద్యార్థులు

విశాలాంధ్ర- చిత్తూరు: జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో చిత్తూరులోని శ్రీ వివేకానంద జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 40 మంది విద్యార్థులు ఈ ఈ పరీక్షలకు హాజరుకాగా అందులో 14 మంది 90 శాతానికి పైగా మార్కులు సాధించగా మిగిలిన విద్యార్థులు 80 శాతానికి పైగా మార్కులు సాధించారని కళాశాల అధినేత సత్యనారాయణ తెలిపారు. ఇందులో చరిత్ చౌదరి అనే విద్యార్థి 99. 17 శాతం మార్కులు సాధించి అగ్రగామిగా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఉత్తమ అధ్యాపకుల ద్వారా క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన వలనే ఇది సాధ్యమైందని కాలేజ్ అధినేత వివరించారు.

20న చిత్తూరులో మెగా జాబ్ మేళా: కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈ నెల 20న శ్రీ వేంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ ఆర్ వి యస్ నగర్, చిత్తూరు నందు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీజినల్ మెగా జాబ్ మేళాను ఈ నెల 15న విజ్ఞాన సుధ కళాశాల లో నిర్వహించాల్సి ఉండగా దీని మార్పుచేస్తూ ఈ నెల 20న వేంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ ఆర్ వి యస్ నగర్, చిత్తూరు నందు నిర్వహించడం జరుగుతుందని, ఈ రీజినల్ మెగా జాబు మేళ నందు దాదాపు 100కు పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 10వ తరగతి నుండి పీజీ ఫెయిల్ పాస్ అయిన 18 సం" నుండి 35 సం" మధ్య వయస్సు కలిగిన స్త్రీలు, పురుష అభ్యర్థులు హాజరుకావచ్చునని, ఈ విషయాన్ని గమనించి, ఈ జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోగలరని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. సలహాలు సూచనల కొరకు 8465830771, 6300954441, 8142509017, 8374421195. ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చునని కలెక్టర్ తెలిపారు.